


శ్రీ శ్రీ వత్స

పుస్తకం లోపల యెట్లావున్నా 'బైండింగ్' యింపుగా వుంటే కొనుక్కో బుద్ధిపుడుతుంది. అదే విధంగా ఏయువతి అయినా సరే కనుముక్కుతీరు యెట్లా వున్నా చక్కగా దుస్తులు ధరించుకొంటే - ఏమో అవయవాలు యెంతవరకు బహిరంగం చేస్తే బాగుంటుందో అంతవరకు బహిరంగం చేస్తే - ఒయ్యారంగా నడిస్తే - ఎవరయినా ఎంత బుద్ధిమంతులయినా కొంత నిలుచుని చూడకతప్పదు. యౌవనంలో వుంటే కాస్త చలిస్తే చలిస్తారేమో కూడాను.

అట్లాగే అయింది వెంకటశాస్త్రి పని. అదరాబాదరా ముసలు నోట్లో వేసుకొని చొక్కా గిక్కా తొడుక్కొని బయటకు వచ్చేసరికి అంబుజమ్మ గొమ్ముగా, చేతులలో పుస్తకాలూ కాళ్లకు నాగసానులు తొడుగుకొన్నే బూట్సులూ అప్పుడప్పుడే యెదుగుతున్న వక్షోజములు జారిపోతూ వున్న పమిటలోనుంచి తొంగిచూస్తూనూ - నడకకనుసరించి వ్రేలుచునయిన పిరుదులు నాట్యంచేస్తూనూ కొంచెం వ్రేలయిన తలతోనూ కాలేజీకి వెళ్తూవుండేది.

కాలేజీలో మధ్యాహ్నం మళ్లీ వెంకటశాస్త్రి బయటకు వచ్చేసరికి ఎదటిగదిలోనుంచి మళ్లీ అంబుజమ్మ తయారు అయ్యేది. ఈవిధంగా రోజులు - వారములు - మాసములుగడిచినవి. వెంకటశాస్త్రి అంబుజమ్మను కామించినాడు. కాముకులయిన యువతీ యువకులకు మామూలుగా జరిగేవ్యవహారములన్నీ వాళ్లిద్దరిమధ్యా జరిగిపోయినవి. ఇకకూడ బలుకుకొనడం మిగిలిపోయింది.

వెంకటశాస్త్రి శుద్ధ శ్రోత్రియ కుటుంబంలో పెరిగినాడు. వాళ్ల పెద్దలంతా - కొందరి [illegible] పురుషాంతరముల నుంచీ వేదాధ్యయనం చేశారు. రాజులదగ్గర అగ్రహారాలు సంపాదించారు. శాస్త్రి యింట్లో సిరి తొగ్గి శ్రోత్రములతో తరతరములూ గతించిపోయినవి. శాస్త్రి తండ్రి చిన్ననాడే పోయినాడు. అతని తల్లికి యింగ్లీషు విద్యమీద వ్యామోహం పుట్టింది. అందువల్ల వెంకటశాస్త్రి బి. ఏ. వరకూ వచ్చినాడు. ఈ సంవత్సరం యూనివర్సిటీ పరీక్షకువెళ్లి పట్టం సంపాదించవలసి వుంది.

అంబుజమ్మ ఆధురులలో పుట్టింది. భూమిమీద పడగానే తల్లి పోయింది. మాటల్లు వస్తూవున్న రోజులలో తండ్రి మరణించాడు. మాతామహీ మాతామహుడు మాత్రం మిగిలివున్నారు. ముత్తవకు వృద్ధాప్యం వచ్చింది. పనిపాటలకు పోయే స్థితిసంపూర్ణంగా పోయింది. తాతకు జవసత్వాలు పోయినవి. దృష్టిమాత్రం తీక్షణంగానే వుంది. ఇంకా ఆ రేకత్తి మాత్రం వదలలేదు. అయితే ఎంతమందికి ఒక్కడు పోట్లుపెట్టు కలుగుతాడు? అందులో అది కుగ్రామం. జీవనం దుర్భరం అయిపోయింది. అందుకోసం పిల్లను క్రైస్తవ మిషనరీలకు అర్పించాడు.

క్రైస్తవ మిషనరీల కరుణాకటాక్షమువల్ల అంబుజమ్మ యీ సంవత్సరం యింటర్మీడియేటు పరీక్షకు వెళ్లుతుంది.

యూనివర్సిటీ పరీక్షలయి పోయినవి. ఇక ఎవరియిండ్లకు వాళ్లు వెళ్లిపోతారు. శాస్త్రి ముఖాముఖీ అంబుజమ్మతో మాట్లాడి తేల్చుకో దలచుకొన్నాడు.



"మీ అభిప్రాయం నాకు తెలుసును. కాని నేను కడజాతిలో పుట్టాను. పయిగా క్రైస్తవంలో చేరాను. నన్ను బలవంతం చేయకండి. కాదనలేను. కాని ఎవరికయినా యిది తెలుస్తుంది. ఇక నా జీవితం అంతా బుగ్గి అయిపోతుంది..."

"పోనిపాటు. నేను ఖులాసాకోసం గాలేను. శాస్త్రప్రకారం నిన్ను పెండ్లిచేసుకొంటాను. ఇక తప్పదు. మనం పెండ్లి చేసుకొందాం."

"మనం పెండ్లి చేసుకోవడం ఎట్లా? మీవారు క్రైస్తవం పుచ్చుకొంటారా?"

"అక్కరలేదు. నేను నిన్ను ప్రేమించాను. నన్ను నీవు ప్రేమించావు. మనం పెండ్లి చేసుకోవచ్చును."

"ఎట్లా - మనం ఏదో విధంగా పెండ్లి చేసుకోవద్దు. మనకెవరు చేస్తారు? పెండ్లి చేసుకోకుండా పారిపోయి రమ్మంటే రాను. దానివల్ల అగౌరవం పాలయిపోతాను."

"మనలాంటి వాళ్లు పెండ్లి చేసుకోడానికి ఒక చట్టం ఉంది. ఆచట్టం ప్రకారం మనం రిజిస్ట్రారువారి యెదుట యథేచ్ఛగా పెండ్లి చేసుకోవచ్చును. ఇద్దరు సాక్షులుంటే చాలును."

"అయితే అది బాగానే వుంది... కాని ఒక్క విషయం తమతో చెప్పక తప్పదు. నాకు తల్లి తండ్రీ లేరు. ఒక ముసలి తాత అవ్వా వున్నారు. నేను క్రైస్తవంలో చేరినా - చదువుకొన్నా - ఏమిచేసినా వాళ్లను పోషించడానికే. వాళ్లను పోషిస్తామంటే..."

"తప్పకుండా పోషిస్తాను."

"వాళ్లిద్దరు నాదగ్గిరే వుండాలి."



" అట్లాగే."

" మీ అమ్మగారు ఒప్పుకోదేమో."

" మా అమ్మతో ప్రసక్తి లేదు."

" నాకోసం మీ అమ్మను వదులుకొంటారా ?"

" నేను వదులుకోను. ఆమె వదులుకొంటే నేనేం చేస్తాను."

" అబ్బ పోనిస్తురూ - ఎందుకో... నాకు భయంవేస్తున్నది. కొన్నాళ్లయిన తర్వాత పెండ్లి చేసుకొందాం."

" వీలు లేదు "

" ఏవో చాలా చిక్కులు వస్తవనిపిస్తున్నది "

" ఏమీ రావు "

" అయినా కొన్నాళ్లు వూరుకుందాం."

" నేను వూరుకోనీయను. నిన్ను ఎత్తుకొని పోతాను. ఇకనీకు తప్పదు. ఎట్లా అయితే అట్లా అవుతుంది."

౨

ఊరంతా గల్లంతు అయిపోయింది. వెంకటశాస్త్రి మాదిగ పిల్లను లేవతీసుకొని పోయినాడంటే తల్లి నమ్మలేక పోయింది. ఏమంటే బి ఏ. చదువుతున్నా త్రికాలములూ సంధ్యావందనం తప్పకుండా చేసేవాడు. లేచిపోయిననాడు రాత్రి కూడా శ్రోత్రియానికి భంగం లేకుండా కాల్యములు నిర్వర్తించాడు. అటువంటివాడు వెళ్లిపోయినాడంటే నమ్మడం ఎట్లా ?

మిషనరీల కీ విషయం తెలిసి మండిపడినారు. బ్రాహ్మణుడు క్రైస్తవపిల్లను కోడం యిష్టమే. అయితే క్రైస్తవమతంలో చేరి పెండ్లిచేసుకొని బ్రహ్మరథం పట్టేవాళ్లు. అట్లా

సందుకు వాళ్ళకు అంబుజమ్మ మీద విపరీతమయిన కోపం వచ్చింది. కిందటి పది పన్నెండు సంవత్సరాలూ ఆమెను పోషించడానికి తమకయిన ఖర్చు సంతా వసూలు చేయడానికి వారు నిశ్చయించినారు.

వధూవరులుభయులూ మద్రాసు చేరినారు. రిజిష్ట్రారు దగ్గిర వివాహం చేసుకొనడాని దరఖాస్తు చేసినారు. వారి వివాహం రిజష్టరు కావడానికి గడువు ౧౪ రోజు లున్నది.

వారు మొదట సర్దారు భవనంలో దిగినారు. రెండు రోజులు గతించేసరికి కుర్రది హిందువు అవునా కాదా అనేసందేహం హోటలువాళ్లకు కలిగింది. ఏవయితే నేం వారుఅక్కడనుంచి లేవవలసి వచ్చినది. ప్రత్యేకం ఒక మూడు అంతస్థుల మేడలో ఒకభాగం అద్దెకు తీసుకొని వున్నారు.

అంబుజమ్మ క్రైస్తవయువతి అని తెలియగానే పని చేయడానికి—చివరకు యిల్లు వూడ్చడానికయినా ఒక్క హిందూస్త్రీ రావడం మానివేసింది. కొంచెం సమీపిస్తే నాసికపుటము లెగిరిపోయే ముసల్మాను వృద్ధాంగనలు తప్ప పని చేయడానికి దొరకలేదు. ఇంకా వివాహం కాలేదు.

శాస్త్రి శుద్ధ ప్రిన్సిపిల్సు మనిషి. అంబుజమ్మ బోర్డింగ్ అనే జయిలులో పెరిగినబిడ్డ. ఇద్దరూ చెరొక గదిలో వుంటున్నారు. ఏదో షికారుపోవడమూ విలాసాగం మాట్లాడుకొనడానికి మాత్రమే ఒకచోట చేరుతుండే వాళ్లు.

రేపో మాపో వివాహం రిజష్టరు అవుతుందని అనుకొంటూ వుండగా రిజిష్ట్రారు ఆఫీసునుంచి శాస్త్రిని రమ్మంటూ వర్తమానం వచ్చింది. శాస్త్రి వెళ్లాడు. క్రైస్తవ మిషనరీలు - తమబోర్డింగులో తమ మాకీషత్తులో వుంటూవున్న పిల్ల పారిపోయి పెండ్లిచేసుకొంటున్నదనిన్నీ - ఆ పిల్లకోసం తాము ఆనాటి వరకున్నూ పెట్టిన ఖర్చులు యీయనిదే లేచిపోయి పెండ్లి చేసుకొనడానికి నీలులేదనిన్నీ తెలియజేశారు.

ఈ విషయం పరిష్కారం కానిదే వివాహం చేయడానికి వీలులేదని రిజిష్ట్రారు తెలియజేశాడు. శాస్త్రి మిషనరీలకు డబ్బు కట్ట నిశ్చయించుకొన్నాడు. రిజిష్ట్రారు శాస్త్రి వుత్సాహమంతా గమనించినాడు. ఆయనకు శాస్త్రినిచూస్తే జాలివేసింది. ఆయన బయటకువచ్చి శాస్త్రితో "బాబూ నేను వయస్సులో నీకంటే ఎంతో పెద్దవాణ్ణి; నీకేదయినా సలహాయిస్తే ఏమీ అనుకోవుకదా?" అన్నాడు.

"పెద్దలు ఏదిచెప్పినా వింటాను. ఏమీ అనుకోను, సెలవీయండి"

"ఈవర్ణాంతర వివాహాలూ అందులో మతాంతర వివాహాలూ ఏవీ సదటబడడం లేదు. వివాహం అయిన కొద్ది రోజులకే ఏదో విధంగా చెడిపోతున్నది—"

"అయితే ఏమంటారు?"

"నేను ఏమంటాను బాబూ, మీరు బ్రాహ్మణులు - మీరు వివాహం చేసుకోదలచుకొన్న యువతి క్రిస్టియన్. అందువల్ల కొంచెం దూరము ఆలోచించమని"

"అయితే మాకిద్దరికీ చెడిపోతు దంటారా?"

"ఎవ్వరు - అది కాలమే నిర్ణయిస్తుంది. కాని ముందు వెనకలు ఆలోచించమని"

"చిత్తం. సెలవు."

# 3

వివాహమయి నాల్గు రోజులయింది. సాక్షిసంతకములు చేయడానికి వచ్చిన యిద్దరు మిత్రులు వెళ్లిపోయినారు. భార్యా భర్తలిద్దరూ మిగిలి పోయినారు.

ఇం [illegible] మళ్లడమా - నూత్నగృహిణితో విహారం చేయడానికి [illegible]రి పోవడమా - కాక మద్రాసులోనే వుండి పోవ[illegible]నే ఆలోచనలో శాస్త్రి పడిపోయినాడు.

[illegible] [illegible]గొడవ పట్టలేదు. తన తాత ముత్తవలు తాన [illegible] చేరనందుకు ఎంత దుఃఖపడు తు[illegible] ఒక సంపన్న బ్రాహ్మణ యువకు నక[illegible]ంగతి వాళ్లకు తెలిసిందో లేదో న[illegible]గిపోయింది. ఈ సంగతి వుత్తరం

వ్రాసింది. అయితే వాళ్లకు చదువురాదు. ఎవరయినా చదివి వినిపించారో లేదో ఆమెను తోచక తపించి పోతున్నది. శాస్త్రికీ విషయం తెలియనే తెలియదు. అతను నూత్నభార్యతో బజార్లవెంట తిరిగ గృహిణికి నచ్చిన దుస్తులూ, గృహిణి ధరిస్తే బాగుంటునని అతను అనుకొనే దుస్తులూ కొనడమే అతనికి నిత్యకృత్యమయి పోయింది.

రోజులు యిట్లాగడిచి పోతున్నవి. ఉదయమే అలారం కొట్టగానే శాస్త్రి లేచేవాడు. కాలకృత్యాలు నిర్వర్తించుకొని - క్షురకర్మ అయిన తర్వాత కూడా గృహిణి నిద్రావస్థలో వుండడం చూచి మృదువుగా లేపేవాడు. ఆమె లేచి కాలకృత్యములు తీర్చుకొని ముఖమూ చేతులూ - మోకాళ్లవరకూ ప్రక్షాళనం చేసుకొని సుభగంకరణము లన్నీ ఆమె గదిలో ఆమె చేసుకొంటూ వుంటే తనగదిలో తన స్నానమూ మండనమూ చేసుకొని దుస్తులూ ధరించి తయారు అయ్యేవాడు. కాఫీహోటేలు నుంచి నౌకరు తెచ్చిన కాఫీ వగయిరాలు వుభయులూ సేవించి బయలు దేరేవారు. గమ్యంలేకుండా పన్నెండు గంటలవరకూ తిరిగేవారు. కాస్త ఆత్మారాముడు జ్ఞాపకం వస్తూ వున్న సమయంలో యింటికి మళ్లేవాళ్లు. ఇంటికి వచ్చి అంబుజమ్మ దుస్తులు తీసివేసి మళ్లీ కాళ్లూ చేతులూ ముఖమూ కడుగుకొనేది. శాస్త్రి యథాప్రకారము స్నానం పూర్తి చేసుకొనేసరికి ఆమె కొత్తదుస్తులతో అలంకరించుకొని భోజనానికి తయారు అయ్యేది.

మోహన్ విలాసంనుంచి మృష్టాన్నమయిన భోజనం వచ్చేది. భోజనం చేస్తూవుండగా శాస్త్రి "అంబూ యిక కార్యక్రమం చెప్పు...మనం నీలగిరి వెళుదాం. ఈ ఎండలు నేను భరించలేకుండా వున్నాను..." అన్నాడు.

"ఏమంత ఎండలు - మనవూళ్లోకన్న యెక్కువగా యెండ యిక్కడ లేనేలేదే. అయినా రెండు రోజులలో నాపరీక్షా ఫలితాలు తెలుస్తవి. తర్వాత రెండు రోజులకు మీపరీక్ష సంగతి తెలుస్తుంది. పరీక్షలసంగతి తెలుసుకొన్న తరువాత ఏంచేసేది ఆలోచింతాం."

"ఆ సంగతి నీలగిరిలో మాత్రం తెలియదా? అక్కడే ఆలోచించుకో వచ్చును."

"పరీక్ష అయితే బి. ఏ. యిక్కడనే చదువుకోవాలని అనుకొంటున్నాను."

"ఏమయితే - జూలైలో కాలేజీలు తెరచేసరికి వద్దాం. నేనూ ఎం. ఏ. చదువుదామను కొంటున్నాను"

"మనం యిక్కడ వుండేట్లయితే యింత యిల్లు ఎందుకు? ఏదో చిన్నయిల్లు అద్దెకు తీసుకొందాం. స్వంతంగా వంట పెడదాం. ఎంతో కలిసివస్తుంది. ఈ దుబారాఖర్చు అంతా ఎందుకు?"

"అయితే యిప్పుడు నేనుచేసేది దుబారా ఖర్చా?"

"కాదుమరి. ఈవిధంగా ఖర్చు చేసేట్లయితే తరువాత మనం ముష్టికి బయలుదేరవలసి వస్తుంది"

శాస్త్రి నవ్వుతూ "అయితే యిక నీకేమీ కొని పెట్టనులే" అన్నాడు.

"నాకు కొనిపెట్టమని నేనేమీ అడగనే లేదు. మీరే..."

ఇంతలో పోస్టు బంట్రోతు వుత్తరాలతో హాజరయినాడు. ఒకవుత్తరం అంబుజమ్మకూ - ఇంకో వుత్తరం శాస్త్రికీ వచ్చినవి.

ఇద్దరూ చదువసాగిరి (చదువుకొన్నారు). శాస్త్రి కంట్లవెంట నీళ్లుకారడం మొదలుపెట్టినవి. కూర్చోలేక పోయినాడు. లేచి మంచంమీద వాలాడు. బోర్లా పడుకొన్నాడు. వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టినాడు. తన వుత్తరం చదువుకొని అంబుజమ్మ కొంచెం సంతోషపడ్డది. ఇటు చూసేసరికి శాస్త్రి స్థితిబోధ పడింది. దగ్గరకు వచ్చి అతన్ని ఓదార్చడానికి ప్రయత్నంచేస్తూ "ఏమిటి. ఎక్కడనుంచి - ఏదివుత్తరం నాకీయండి. నేను చదివిచూస్తాను" అంది. అతను ఆమె వంకనయినా చూడకుండా వుత్తరం ఆమెచేతి కందించాడు. ఆ వుత్తరం చదువుకొన్నది. కొడుకు సంగతి తెలుసుకొని శాస్త్రి తల్లి కృష్ణానదిలోపడి మరణించినట్లు వుంది. వెంటనే అతన్ని రమ్మనికూడా వ్రాసివుంది.

ఆమే విచారపడ్డది. అయితే వెంటనే తెప్పరిల్లుకొని "ఏమిటండీ. మీరు నన్ను పెండ్లిచేసుకొన్నంత మాత్రాన నికే కృష్ణలోపడి చచ్చిపోవలెనా" అంది అంబుజమ్మ.

ఆ మాటకు అతనికి కోపంవచ్చింది. "నీకు యిట్లాంటి విషయాలు అర్థంకావులే" అన్నాడు. ఆరోజు అతను భోజనం చేయలేక పోయినాడు. ఆరాత్రికి యింటికి పోవలెనని నిశ్చయించుకొన్నాడు.

ఆమె ఏమీ అభ్యంతరం చెప్పలేదు. అయితే అతను రైలుకు బయలుదేరుతూ వుండగా "ఏమండీ మాతాత - అమ్మమ్మ వస్తామని వ్రాశారు. వాళ్ళకు డబ్బు పంపుతాను. మీరు తిరిగీ వచ్చేసరికి ఒకచిన్న యిల్లుతీసుకొని అందులో ప్రవేశిస్తాను" అన్నది.

"సరే" నన్నాడు శాస్త్రి.

౪

పరీక్షా ఫలితాలు వచ్చినవి. అంబుజమ్మ యింటర్మీడియేటు ప్యాసు అయింది. శాస్త్రి బి. ఏ. తప్పిపోయినాడు. ప్రెసిడెన్సీ కాలేజిలో ఆమె చదవదలుచుకొన్నది. కాలేజికి సమీపంగా వుండేటట్లు చూసుకొని బార్బర్సుబ్రిడ్జి ప్రాంతాలలో ఒకచిన్న యిల్లు అద్దెకు తీసుకొన్నది. అదొక బంగళా లాగున్నదని ఆమె సంతోషించింది. తాత ముత్తవ్వకూడా అయిల్లు బాగున్నదన్నారు. అది దేవేంద్ర భవనంగా వాళ్ళకు తోచింది.

చుట్టుపక్కల అంతా తోటలు - దారిద్ర్యం యింకా పడలని క్రోటన్లు - చెట్లకింద వుండే జనమూ వుంటూ వున్న కారణంనుంచి అంతయిల్లు అంతతక్కువ అద్దెకు దొరికింది. సముద్రానికి సమీపములోనే అయిల్లు వుంది. ఇంట్లో అంతా రమ్యంగానే వుంది. గాలికూడా యింట్లోకి బాగానే వస్తుంది. బాగా గాలివచ్చేమిటి - ఎప్పుడూ గాలి రయ్‌మని ఏదిక్కునుంచో ఒక దిక్కునుంచి వస్తూనే వుంటుంది.

అంబుజమ్మ నూతన గృహప్రవేశం చేసి వారం రోజులయినప్పటికీ శాస్త్రి యింకా మద్రాసు చేరలేదు. ముసలివాడు మనమరాలి పెనిమిటిని చూడవలెనని చాలా ఆత్రపడుతున్నాడు. మద్రాసులో చాలాభాగం తిరిగి చూశాడు. తాంబరంలో క్రోంకంపెనికి పోయిచూసినాడు. చాలామంది తమవూరునుంచి వచ్చి పనిచేస్తున్న వాళ్ళను చూసినాడు. ఆరేక స్త్రీ పట్టుకొని పనిచేసేట్లయితే తన పనితనానికి రోజుకు సుళువుగా రెండురూపాయలు సంపాదించేటట్లు తోచింది. రోళ్ళుకట్టి యిచ్చేట్లయితే కావలసినంత రోలు పతనుగా వేస్తారని తెలిసింది. ఆ వృద్ధాప్యంలో కొద్ది రోజులలోనే తాను కుబేరుడితో సరిసమానం కావచ్చునని తోచింది. రోళ్ళపనికి వుపక్రమించాడు. అంబుజమ్మకి దేమీ విపరీతంగా తోచలేదు. తాత నాల్గు డబ్బులు సంపాదించి ఎవరికిచ్చి పోతాడు? తనకే కుడుతుంది అనుకొన్నది.

ముసలది వంటపనికి తయారు అయింది. ఉదయం బజారుపోయి యింట్లోకి ఏమయినా కావలసినవి తేవడం - భోజనంచేసి పడుకోవడం - నిద్రపోవడం - సాయంత్రం అలంకరించుకొని బీచికి పోవడం - అంబుజానికి నిత్యకృత్యాలు అయిపోయినవి.

శాస్త్రి వస్తూవున్నట్టు వుత్తరం వచ్చింది.

సమయానుకూలంగా గుర్రాలు తీసుకొని పెనిమిటిని యెదుర్కొనడానికి వుదయమే అంబుజం సెంట్రల్ స్టేషనుకు వెళ్ళింది. శాస్త్రి చూసేచూడటంతో అంబుజమ్మను ఆర్ద్రాలింగనం చేసుకొన్నాడు. ముద్దు పెట్టుకొన్నాడు. వెనకనుంచి ఆమె కటిభాగంమీద చెయ్యివేసినాడు. ఇద్దరూ స్టేషను యివతలకు వచ్చినారు.

"నేను వేరేయిల్లు తీసుకొన్నాను." అన్నది ఆమె.

"అవును. ఉత్తరం వ్రాశావు"

"ఇల్లు ఎంతో బాగుంది. అద్దె నాలుగునోట్లు. ౧౫ రూపాయలు. వీరయితే అంతయిల్లూ ౫౦ రూపాయలకి తీసుకోలేవారు"

"అయినా బార్బర్సుబ్రిడ్జి దగ్గిర అన్నావు. అక్కడ అంతమంచి యిళ్లులేవే?"

"కాదు. ఒకబంగళా - మాతాతా - అవ్వాకూడా ఎంతో బాగుంది అన్నారు"

"సరే. వెళుతున్నాంగా. ఇక చూస్తాం."

ఇంటిదగ్గిరకు వచ్చారు. చుట్టూ శాస్త్రి చూశాడు. ఆ పరిసరాలను అతనికి కొంచెం అసహ్యం పుట్టింది. మద్రాసులో మామూలుగా కట్టేమండువా పద్ధతిన కట్టిన యిల్లు అది. ముందున్న గదిఅంతా అంబుజమ్మ ఆంగ్లో యిండియన్ పద్ధతిలో అలంకరించింది. పడకకుర్చీలో శాస్త్రి వాలాడు. అంబుజమ్మను చూసి ఏమయినా తాగడానికి యిస్తావా ?" అన్నాడు. "ఓ తప్పకుండా" అన్నది. గబగబ లోపలికిపోయి ఒక ట్రేలో యిన్ని దేశివాళీ బిస్కట్లు - టీసెట్టు పట్టుకొనివచ్చి ఎదటవుంచి పక్కకుర్చీలో కూర్చుంది. అతను బిస్కట్టు ముక్కనోట్లో వేసుకొన్నాడు. అదేమీ రూపాంతరం పొందేటట్టు కనుపించలేదు. గట్టిగా కొరికి చూశాడు. లాభంలేక పోయింది. స్వాధీనం కాకపోతుందా అని టీలోనుంచి నోట్లో వేసుకొన్నాడు. అది తన నైసర్గిక స్వభావాన్ని కానీ స్వరూపాన్ని కానీ పోగొట్టుకో దలచుకోలేదు. అది మెల్లిగా అవతలపెట్టి టీపుచ్చుకొన్నాడు. అది ఆటే యిబ్బంది లేకుండానే వెళ్ళింది. అదే యింకొక కప్పు పుచ్చుకొంటూ "నీకు వంటచేయడం వచ్చునా ?" అన్నాడు.

"ఏదో కాస్త వచ్చు. అయినా ముసలిది వుంది అది చాలా బాగా చేస్తుంది."

"అయితే యీపూట ఏంచేయించ దలచుకొన్నావు."

"ఏమి చేయించమంటారు."

"పప్పూ పులుసూ, ఏదయినా పచ్చడి ; చాలు. నాకు చాలా ఆకలి అవుతూంది. త్వరగా చేయమను. నేను స్నానం చేయడానికి బాగా కాగిన వేడినీళ్లు కావాలి. వంటఅయ్యే లోపల నీవు నీళ్లు కాగబెట్టు."

"ఎందుకు అక్కరలేదు. పొంతకుండలో కాగుతూనే వుంటవి."

"పొంతకుండ అంటే..."

అంబుజమ్మ నవ్వుతూ - "తెలియదు - తెలియదు" అంది. అతనికే మీబోధపడింది కాదు. "చూపిస్తాను రండి. అయినా మీరు యిల్లు చూడనేలేదు. లోపలికివచ్చి ఒక్కసారి చూడండి," అంది. అతను ఆమె మాటతోసి వేయలేక లోపలికి బయలుదేరినాడు. లోపల హాలులో ముసలివాడు ఒకయీతాకుల చాపవేసుకొని - ఎదట చట్టిలో తోళ్లు నానవేశాడు. ఒకచెప్పు అప్పుడే తయారయింది. అది సరిగా వుందా లేదాఅని చూస్తూవున్న సమయంలో శాస్త్రి వచ్చినాడు. శాస్త్రిని చూసీ చూడకవంతో లేచి నిలుచుని నమస్కారంపెట్టి "బాబూ తామేనా అమ్మాయిని చేసుకొంగి" అన్నాడు. ఎవరితడు అన్నట్టు శాస్త్రి అంబుజమ్మవంక చూశాడు. తన తాత అని చెప్పింది. తక్కిన గదులలోకి నెట్టాగా పోయినాడు. వంటరిమంచం బాగానే వుంది. అయితే గదిలో గుడ్డలన్నీ మాత్రం గండరగోళంగా వున్నవి. వంటయింటిదాకా పోలేక పోయినాడు. "ఈ గుడ్డలన్నీ చాకలింటికి పోవా" అన్నాడు. "ఎందుకుపోవు - తెలగ చాకలివాడవడూ వేయించుకు పోయ్యేటు లేదు. తురక చాకలివాడయితే వేసుకొని పోతాడు. ఇంకా దొరకలేదు. సాయంత్రం మీరాసాయబుపేట పోయి పట్టుకొని వస్తాను." అన్నది.

అతనేమీ మాట్లాడలేదు. మెదలకుండా గదిలోకివచ్చి పడకకుర్చీలో మళ్లీ వాలాడు. రాత్రిఅంతా మెయిలులో నల్లుల బాధవల్ల నిద్రలేకపోయింది. అట్లాగే కాళ్లు బాగజాపినాడు. అంబుజంచూసి తల ఒత్తుకోకుండా వుండడానికి ఒక దిండు తీసుకొనివచ్చి తలకిందవుంచింది. అతను కళ్లు మూసుకొన్నాడు. ఆమె లోపలికి వెళ్లిపోయింది.

తూర్పునుంచి గాలి తోలుతున్నది. చల్లగా గాలి వీస్తూవుంటే హాయిగావుంది. నిద్రపట్టబోతున్నది. జాగ్రదవస్థలో లేనట్టే. చటుక్కన లేచాడు. ముక్కు గట్టిగా మూసుకొని "అంబూ" అని పెద్దగొంతుతో పిలిచాడు. ఆమె పరుగెత్తుకొంటూ వచ్చింది. ఆమె బాగా మాసిపోయిన చిన్నలంగా, అంతకన్నా మాసిపోయి బాహుమూల ప్రదర్శనం అవుతున్న చిన్న రవికతోనూ, చిరుగులతోవున్న వోణితోనూ, ఎదట నిలుచుంది. అతను నిర్ఘాంతపోయినాడు. కండ్లుమూసుకొన్నాడు. "అబ్బబ్బ—యీ వెధవ చండాలపు వాసన అయినా భరిస్తాను.

కాని నిన్ను అసహ్యపుగుడ్డలతో చూడలేను,” అన్నాడు. ఆమె కొంచెం నివ్వెరపోయి “వాసన ఏమిటి” అన్నది. “ఇక్కడ ఒక్కక్షణం నిలుచో తెలుస్తుంది.”

“ఓహో ఎదటయింటి సాయిబులు కరవాడి (అంటే ఎండబెట్టిన చేప) వేయించుకొంటున్నారు.”

“అబ్బ అదేమో నాకు తెలియదు. ముందు కిటికీ తలుపులు వేయి.” తలుపులు వేసింది. తెల్లగా ఫుటికిన ఒక జేబు రుమాలుమీద యింత సెంటుపోసి తీసుకొనివచ్చి యిచ్చింది.

“గాలి రావడంలేదు, ఫాన్ వేయి.”

“ఎలెక్ట్రిసిటీ యీయింటికి లేదు. వచ్చేనెల పెట్టిస్తానని యింటివాడు చెప్పాడు.”

“అబ్బ నీవు, నీ వేషం చూడలేను పో.”

౫

చేపలవాసన ఎంతసేపుంటుంది? ఎట్లాగయితే నేం శాస్త్రికి జాగ్రదవస్థ పోయింది.

మేనమామగారి యిల్లు. స్నానసంధ్యావందనాలు అయిన తర్వాత తీర్థం పుచ్చుకొనడానికి భక్తిశ్రద్ధలతో మేనమామగారి దేవతార్చన పీఠం దగ్గరకు వెళ్లాడు. షోడశపూజ అయింది. దేవీపూజాకూడా అయిపోయింది. హారతి కర్పూరం వెలిగించి 'లక్ష్మీం క్షీరసముద్రరాజ తనయాం శ్రీరంగధామేశ్వరీం దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం......” అని పుష్పస్వరంతో చదువుతున్నాడు. ఆయన కూతురు రాజ్యలక్ష్మి ఊదారంగుచీర కట్టుకుని తలవంచుకొని నిలుచుని వున్నది. ఆమె శాస్త్రికన్న ఒక సంవత్సరం పెద్ద. తెల్లని దేహకాంతి - అపూర్వ కాయము - ఆతెల్లటి కళ్లూ - కళ్లు చెదిరిపోయే ఎర్రటిబొట్టు - ఆబొట్టుకు కొంచెం అడుగున యువజనమోహకరాళ కాళసర్పము లాగావున్న కనుబొమలు - కనుపించినవి. అప్రయత్నంగా అంతా మరిచిపోయి హఠాత్తుగా లేచి నిలుచున్నాడు. ఇంక ఆమె అధరాన్ని కొరికివేస్తాడు. ఆమె మహిషాసురమర్దని స్వరూపందాల్చి చూసి చేతులున్న శాస్త్రిని లెంపకాయ కొట్టింది. దెబ్బకు దిమ్మరపోయినాడు.

శాస్త్రికి నిద్రమెలకువ వచ్చింది. మద్రాసు తిరువలిక్కేణి - బార్డ్స్‌స్ట్రీట్ - ఇల్లూ - తెప్పక్కుళవ గృహాలే కండ్లఎదట పాడగట్టినవి. ఒక్కసారి ఆవలించి - ఒళ్లు విరిచి “అంబా - అంబా” అన్నాడు.

“ఒళ్లు కడుక్కొంటున్నాను. వస్తున్నాను. క్షణంలో వస్తాను”

'ఒళ్లు కడుక్కోవడం ఏమిటి?...స్నానం చేయడానికి ఒళ్లు కడుక్కొంటున్నా నంటున్నది కాబోలు' అని అనుకొని మళ్లీ కుర్చీలో జేరగిల బడినాడు. ఎక్కడెక్కడికో ఆలోచనలు వెళ్లినవి. ఆకలి భగ్గున మండిపోతున్నది - గడియారం వంక చూశాడు. పన్నెండున్నర అయింది. “ఇంకా వంట అయిందో కాలేదో, ఆ ముసలిది శుభ్రంగా రుచిగా చేసిందో లేదో...సరే...అంతా బాగానేవుంది. ఇక ముసలివాణ్ణి ఏమని పిలవవలెను. ముసలిదాన్ని ఏమనిపిలవవలెను...అయినా నా భార్యనుగురించి వాళ్లకేమి వాళ్లతో నా కేం సంబంధం?... వాళ్లను వాళ్ల పేర్లతో పిలుస్తాను. ఎవళ్లకేమి కోపంవస్తుంది, వస్తే నా కేం? వాళ్లే వెళ్లిపోతారు...” అనుకొంటూ వుండగా పుల్లపాయల వాసనవచ్చింది. “అబ్బ ఏమిటి మళ్లీ ఏదో చండాలపు వాసన వస్తున్నది. ఈ యింట్లో యీ వాసనతో ఎట్లా బతకడం. అబ్బ చచ్చి పోతున్నాను. ఈ యింట్లోనుంచి లేవక తప్పదు. అయినా యీ ముసలివాడేమిటి?...చెప్పులూ పిమ్మనూ,...సరే పిలుస్తాను వేరే వుండమని చెప్తాను. కావలిస్తే డబ్బు యియ్యవచ్చును.” ఈవిధంగా ఆలోచనా సగంసగంలో నడిపోయినాడు. అంబుజమ్మ యింకా రాలేదేమా అని తహతహలాడుతున్నాడు. ఎందువల్లనూ లోపలికి పో బుద్ధి పుట్టలేదు. గడియారం మాత్రం గిరగిరతిరిగి పోతున్నది. శాస్త్రికి చాలా కోపం వచ్చింది. మళ్లీ గట్టిగా “అంబూ” అన్నాడు. “యస్” అంటూ ప్రత్యక్షమయింది.

ఆమెదర్శనీయంగా వుంది. ఆమెరంగు చామనచాయ అయినప్పటికిన్ని దేహయష్టి ఆకర్షణీయంగా వుంటుందని

చెప్పక తప్పదు. అవయవములన్నీ ప్రత్యేకం తయారు అయిన వాటిలాగా వుంటవి. మంచి గట్టి శరీరం. అందులో సహజముగా నైతేనేమి - క్రైస్తవ దొరసానుల శిక్ష వల్ల నయితే నేమి - ఏసమయమప్పుడు ఎట్లాంటి గుడ్డలు కట్టుకోవలెనో చక్కగా తెలుసును. ఇప్పుడు ధనాభావం అనేదే ఎరగని స్థితివచ్చేసరికి కోయకొన్న న్ని చీరెలు వగయిరా లున్నవి.

అయితే అనేక విషయాలలో మలకట్టు బొట్టును వ్యతిక్రమించింది. కాని ఒక్క విషయంలో మలాచారాన్ని మాత్రం దాటిపోలేదు. వారానికి ఒక్క పర్యాయమే దేహాన్నంతా తడిపేది. ప్రతిరోజూ కాళ్లూ చేతులూ ముఖము గొంతుతో సహా కడుక్కొనేది.

తెల్లటి చీరె కట్టుకొని - స్తనాలు పమిటలోనుంచి తొంగిచూస్తూ - ఆమె వచ్చేసరికి శాస్త్రి కోపం తగ్గింది. ఆమెను సాదరంగా - సాంగముగా - మందహాసంతో చూస్తూ "ఇవాళ అన్నపుప్రాప్తి వుందా?" అన్నాడు శాస్త్రి.

"లేదండి. నీళ్లు పోసుకోండి, లేపుదామని అనుకొంటూ వుండగానే మీరు పిలిచారు. లేవండి" అన్నది. అతను లేచి లోపలికి వెళ్లినాడు. స్నానాల గదిలోకి వెళ్లాడు. తలుపు మూసివేసి దిగంబరుడుగా స్నానానికి ఉపక్రమించబోయినాడు. పొంతనుండి నుండా తీసుకొనివచ్చి పట్టుపంలో నీళ్లు ఎంత వేడిగా వున్నవీ అంబుజమ్మ గమనించలేదు. చెంబు ముంచేసరికి చేతి తాట వూడిపొయ్యేట్టు అయింది. "అంబూ - ఇంత వేడినీళ్లు ఎలా పోసుకోడం - ఎవరు పట్టారు యింత వేడినీళ్లు. తాట వూడిపోయ్యేట్టు వుంది" అని శాస్త్రి గదిలోనుంచి అరిచాడు. "అయ్యో చూడలేదు - ఇదుగో చన్నీళ్లు తీసుకొని వస్తున్నాను." అంటూ వేగిరంతో నీళ్లు - చన్నీళ్లు వేడినీళ్లు కలపడానికి ఒక తొట్టి తీసుకొని వచ్చి "తలుపుతీయండి. నీళ్లు తయారు చేస్తాను." అంది. "అవన్నీ అక్కడవుంచి వెళ్లిపో - నేను గుడ్డలేకుండా వున్నాను. నేను తీసుకొని తలుపుతాలు పడుతాను" అన్నాడు శాస్త్రి. ఆమె ముసిముసి నవ్వులతో వూరుకొన్నది. స్నానం చేసేయినా తరవాత అతనుతలుపు తీసేదే ఆత్రంగా ఆమె నిండే తొట్టితో లోపల ప్రవేశించింది.

"ఏమిటి - అసహ్యం - నేను గుడ్డలేకుండా వున్నానంటే లోపలికి వస్తావు"

"మనలో మనకేమిటండి. అయినా మొగవాళ్లకు సిగ్గేమిటండి."

"ఛీ ఛీ. అవతలకుపో" అంటూ కుడుచుకోడానికి తెచ్చుకొన్న తువాలు చుట్టుకొన్నాడు.

స్నానం పూర్తి అయి వసారాలోకి వచ్చేసరికి ఆ గాలుల అందులో సగము సన్నని ఘాటైన వాసన వస్తూవుంది. అది ఎక్కడనుంచి వస్తూవుందోనని ఆలోచించడం ప్రారంభించినాడు. ఎదటి గదిలోనుంచి వస్తూవున్నట్లు తోచింది. మెల్లిగా వెళ్లి కిటికీలోనుంచి చూసినాడు.

ముసలిది చుట్ట కాల్చుకొంటూ పక్కనవున్న బూడిదె కుప్పమీద వుమ్మేస్తున్నది. ఒకచేత్తో పొయ్యిమీద అటికలో తెడ్డుపెట్టి తిప్పుతున్నది. ఆగదిశుభ్రం చేసి యెన్ని మన్వంతరాలయిందో వూహించలేక పోయినాడు. ఆదృశ్యం చూడలేక పోయినాడు. పయిగా బుట్టలో వడేసిన అన్నము ముసలిది వుమ్మేస్తున్న బూడిదె కుప్ప దగ్గరనే వుంది. అతనికి డోకువచ్చింది. పొట్టలో ఏదో తెమలడం ఆరంభమయింది. అక్కడ ఒక్క క్షణం వుండలేక తన గదిలోకివచ్చి సుల్లి సుగ్రీవాలి ఏదో ఆలోచన ప్రారంభించినాడు. అంబుజమ్మ వచ్చి "లేవండి అన్నంతిందాం" అన్నది. ఆమెవంక రూక్షంగా చూస్తూ "ఎవరా వంటయింట్లో పిశాచం. నీ అమ్మేనా అది" అని మండిపడినాడు.

ఆమె నేమీ తోచలేదు. నిశ్చేష్టురాలయింది. ఏమీ సమాధానం చెప్పలేక పోయింది. తలవంచుకొంది. ముఖం వివర్ణమయింది. "ఏంచూస్తావే... నేను యిక లోపలికి రాలేను. ఆ అన్నం యిక్కడికే తీసుకొనిరా. ఇక్కడే తింటాను." అన్నాడు.

"బల్లమీద పెట్టేదా - కింద పెట్టేదా?" అని ఆమె అన్నది.

కేడమ స్టూ - ఈగది పూడ్చి గాన్ని గాగా అయిందో ... బల్లమీదనే పెట్టు. నీవుకూడా యిక్కడే పెట్టుకొని తిను.'' అని శాస్త్రి అన్నాడు.

ఆమె చప్పున లోపలికిపోయింది. రెండు పింగాణీ పళ్లాలూ - వడేసినబుట్టలో అన్నం - చట్టితో గోంగూర పుల్లిపాయలు వేసి చేసినపులుసు కూడా - అల్యూమినం గిన్నెతో పులుసు లాగావున్న పప్పు - పుల్లిపాయలూ చింతపండూ వేసి చేసినకారం - రెండు తెడ్లూ పట్టుకొని వచ్చి పెట్టింది.

శాస్త్రి పరధ్యానంలో వున్నాడు యిదంతా చూడనే లేదు. ఆమె అన్నివస్తువులూ కంచంలో వేసింది. అతను చూసేలాగా ఎదురుగుండా నిలుచుంది. అతను చూశాడు. "ఏమి అన్నీ వడ్డించావా'' అన్నాడు. ఆమె తల వూపింది. వచ్చి బల్లదగ్గిర కూచున్నాడు. ఆ రూపంతో వున్న వ్యంజనాలను అతనదివరలో ఎన్నడూ చూసి ఎరగడు. అసలు శాస్త్రియింట్లోకి పుల్లిపాయలు రావడం మానివేసి యెన్ని పురుషాంతరము లయిందో శాస్త్రికి తెలియదు.

ఆకలి హడావిడిలో అన్నం గబగబ పప్పువేసి కలిపాడు. ఒక్కముద్ద నోట్లోకి ఎట్లాగో పోయింది. పక్కనువున్న వుల్లిపాయ కారంతీపి నంజపోయినాడు. చేయి నోటిదగ్గిరకు వచ్చేసరికి ఖంగారయిపోయి అన్నీ వాసనచూశాడు. పయిప్రాణం పయిన పోయింది. "అబ్బబ్బ ఈ చండాలపు వాసన - ఏమిటిదంతా మాంసమా ఏమిటి?'' అన్నాడు.

"మీకు మాంసం చేయిస్తానా?''

"ఓహో నాతల తిరిగిపోతున్నది. నాకు డోకువచ్చేట్టుంది. చంఢాలం - చండాలపు వాసన. అసహ్యం...'' అంటూ గబగబ లేచిపోయి సబ్బుతో చేయి కడుక్కోడం మొదలుపెట్టాడు. అంబుజమ్మకు అర్థంకాలేదు. "ఏమిటి ఏమిటి'' అని అడిగింది. అతను మాట్లాడలేదు. "ఏమిటండీ - అంత అసహ్యం చక్కని బళ్లారి వుల్లిపాయలు వేసిచేస్తే ఏమిటండీ యీగోల'' అంది.

"అవును గోలే - నేను అన్నంతినడం నీకిష్టం లేదుగా'' అంటూ కడుక్కొన్న చేయి తుడుచుకొని మళ్లీ చేయి వాసన చూసుకొని మళ్లీ సబ్బుపెట్టి కడుగుకొని వాసన చూసుకొని - చొక్కా తొడుగుకొని ఆ మధ్యాహ్నపు యెండలో బయటకు వెళ్లిపోయినాడు.

## ౬

రాత్రి ఏడుగంటలయింది. అంబుజం చాలా విచారంతో కూర్చున్నది. ముసలిదానికి గాని ముసలివాడికి గాని ఆమె విచారంతో వున్నట్టు తెలియదు. మధ్యాహ్నం అన్న తిననేలేదు. ఇక శాస్త్రి భోజనంగతి ఏమిటా అనే ఆలోచన చేయసాగింది. ఇప్పుడీ వయసులో ముసలది బ్రాహ్మణవంట చేయడం దుస్తరం - తాను నేర్చుకోందా మనుకొన్నది. అయితే ఎవరు నేర్పుతారు? శాస్త్రికి వంటచేయడం వచ్చునో రాదో. వస్తే అతను అంతకోపంలో వున్నవాడు నేర్పుతాడో నేర్పడో? అంతా అయోమయంగా వుంది ఆమెపని. ముసలిది చీకటిపడుతూ వుండగానే మంచిమాట చేసుకొని గురకలు పెడుతున్నది. ముసలివాడు పాలుతాగి మళ్లీ చెప్పుల పనిలో కూర్చున్నాడు. రోజుకు అయిదు రూపాయలు సంపాదిస్తున్న బ్రహ్మానందంలో వున్నాడు. వాడికి యీ ప్రపంచంతో సంబంధం లేదు. మద్రాసుఅంతా తల్లకిందులుగా మారిపోయినా వాడికి లక్ష్యంలేదు.

శాస్త్రి ఇంటికి వచ్చాడు. అంబుజమ్మ ఎదురుగుండా వెళ్లి స్వాగతం చెప్పింది.

"ఏమిటి అన్నంతిన్నారా లేదా?''

"ఈ పూటకూడా భోజనం చేశాను''

"చాలా సంతోషం - మధ్యాహ్నం అప్పుడు అట్లా మీరు పరుగెత్తితే నేను ఏంచేది చెప్పండి - పోని మీకు సయించదంటే హోటేలునుంచి తెప్పించక పోయినానా? అంత తొందరపడితే ఎట్లా చెప్పండి. చూడండి నేను యింతవరకూ భోజనం అయినా చేయలేదు.''

"చాలా మంచిదానివి. త్వరగా భోజనంచేయి, వెన్నెలగా వుంది. ఉక్కగాకూడా వుంది - బీచికి షికారు వెళుదాం త్వరగా కానియ్యి.''

"ఓ రెండు నిముషాలలో బయలు దేరుదాము." అని లోపలికి వెళ్లింది.

అతను అక్కడ కుర్చీలో జేగిలబడి భవిష్యత్కార్యాన్ని ఆలోచిస్తున్నాడు. ఏమీ పాలుబోలేదు. ఇంతలో ఏవో పిల్లులు పోట్లాడుకొంటూ వుంటే అయ్యే రోదన ధ్వనిలాంటిది వినిపించడం మొదలుపెట్టింది. అది ముసలిదాని గురక అవునా కాదా అనే సందేహం కలిగింది. లేచి వెళ్లి చూచినాడు. నోరు తెరుచుకొని ముసలిది పడుకొని గురకలు పెడుతున్నది. ఆ తెరుచుకొన్న నోట్లో కొన్ని పండ్లు పోయీ - కొన్ని పండ్లు వుండీ - పక్కను సీదుకారుతూ మహా అసహ్యంగా వుంది. చూడలేక పోయినాడు. అక్కడినుంచి ఇవతల గదిలోకి వచ్చినాడు. కూర్చోలేక పోయినాడు. ఇంకా అంబుజం రాలేదని తొందరపడుతూ అటూ యిటూ పచారు చేస్తున్నాడు. ఆమె వచ్చింది. ఆమెవంక శాస్త్రి చూసే సరికి "బయలు దేరుదామా" అన్నది. జవాబుఅయినా లేకుండా వుభయులూ బయలుదేరినారు. బీచిరోడ్డు మీదికి వచ్చేవరకూ వాళ్లు ఒక్కమాట అయినా మాట్లాడుకో లేదు.

అంతే సముద్రపు ఒడ్డునా కూడా గాలిలేక చెమట పోస్తూవుంది. "నీళ్లదగ్గిర కూచుంటే కాస్త అయినా హాయిగా వుంటుందేమో" అన్నాడు శాస్త్రి.

"అవును. అక్కడ తప్పకుండా గాలి కొడుతూ వుంటుంది. అక్కడికే పోదాం" అన్నది అంబుజమ్మ. సముద్రం ఒడ్డుకు వెళ్లారు. రాత్రి తొమ్మిదిగంట లయింది. ఎక్కడో దూరాన తప్ప అంతా నిర్మానుష్యంగా వుంది. వెన్నెలసొంపు తప్ప మరేవిధంగానూ సొంపుగాలేదు. ఆ యిసుకలో ఇద్దరూ చతికిల బడ్డారు. ఆమెఒడిలో తలకాయ పెట్టుకొని కాళ్లుజాచి పడుకొన్నాడు. ఆమె అతని చెదిరిపోయిన క్రాపింగు సవరించసాగినది.

"ఏమిటి యిక జరగవలసింది?"

"ఏముంది జరగడానికి?

"ఇట్లాంటి సమాధానాలు నాతో చెప్పకు. ముసలివాడూ ముసలిదీ మనయింట్లో వుండడం నాకిష్టంలేదు. వాళ్లు వుండడానికి వేరేయిల్లు కుదుర్చు. వాళ్లకు కావలసిన డబ్బంతా యిద్దాం."

"వాళ్లను వదిలిపెట్టి నేనుండలేను. అంతే కాకుండా ముసలివాండ్లకు కూడం ఏమీ యివ్వ నవసరం లేనేలేదు. ముసలివాడు రోజుకు అయిదు రూపాయలు సంపాదిస్తున్నాడు."

"వాళ్లు ఉండడానికి వీలులేదు. నేను నిన్ను పెండ్లి చేసుకొన్నాను - నాకు వాళ్లతో సంబంధం ఏంవుంది - నీకువుంటె అంటావా కావలిస్తే డబ్బు యిస్తాను: అంతే.

"ఇప్పుడిట్లా మీరు అంటారని కలలోనయినా అనుకోలేదు. నన్ను మీరు పెండ్లిచేసుకోమని బలవంతంపెట్టి నప్పుడు మాతాతా అమ్మమ్మ సంగతి మీరు ఒప్పుకొంటేనే నేను మీతో వచ్చాను."

"వాళ్లీవిధంగా వుంటారని కానీ - యిట్లాంటిదిండి తిని యిట్లాంటిపనులు చేస్తారనికానీ నాకు తెలియదు"

"మీకు యెందుకు తెలియదు. నేను అథురులలో పుట్టినదాన్ని అని మీతో చెప్పానే."

"ఆ విషయాలన్నీ యిప్పుడెందుకు? వాళ్లున్న యింట్లో నే నుండను. నేనున్న యింట్లో వాళ్లుండడానికి వీలు లేదు."

"నాతో వాళ్లుండక తప్పదు."

"అయితే నేను నీకవసరం లేదన్నమాట."

"నేను మీకవసర మున్నానో లేదో చెప్పండి" చాలాసేపు మాట్లాడుకోకుండా యిద్దరూ మౌనం బిగించుకొని కూర్చున్నారు. చివరకు

"ఏముంది నాకు నిద్రవస్తున్నది. బయలు దేరుదామా?" అన్నది అంబుజం. అతనేమీ మాట్లాడలేదు. ఆమె లేచి నిలుచున్నది. అతనూ మెల్లిగా లేచాడు. ఉభయులూ బయలుదేరినారు. మార్గమధ్యంలో ఒక్కమాట మాట్లాడుకోకుండా అతివేగంతో యింటికి చేరి-

ఇంటికి రాగానే ఆమె లోపలికి పోయింది. అతను యథాప్రకారం కుర్చీలో పవ్వళించినాడు.

## ౨

అర్ధరాత్రి - గదిలో పచ్చని దీపం వెలుగుతూ వుంది. కిటికీలోనుంచి రంయ్యిమని గాలి వస్తూవుంది. మధ్యమధ్య ఏదో దుర్గంధం గాలితో పాటువస్తూ వున్నదని శాస్త్రి అనుకొన్నాడు. అంబుజమ్మ గాఢనిద్రలో వుంది. కిటికీ వేస్తే గాలిలేకుండా పోతుంది. గాలిలేకపోతే నిద్ర పట్టడం అసంభవం. దుర్వాసన భరించలేకుండా వున్నాడు. పక్కనువున్న బక్కింగ్ హామ్ కాలవనుంచి వస్తూవున్న దుర్వాసనేమో అనుకొన్నాడు. మంచంమీదనుంచి లేచి దూరంగా కిటికీ ఎదురుగుండా ఒక పడకకుర్చీ వేసుకొని జేరగిలబడ్డాడు. గాలి యథాప్రకారంగానే వస్తూవుంది. అయితే దుర్వాసన ఏమీలేదు. అర్థం కాలేదు. బహుశః చెడువాసన పోయివుంటుందను కొన్నాడు.

అక్కడనుంచి లేచి మళ్లీ మంచంమీద పడుకొన్నాడు. మళ్లీ దుర్గంధం రావడం మొదలుపెట్టింది. ఎక్కడనుంచి ఆదుర్వాసన వస్తూవుందో అతను వూహించలేక పోయినాడు. కొంతసేపయిన తర్వాత లేచి పెద్దటేబిల్ దీపం వెలిగించాడు. మంచంమీద వున్న దుప్పటి స్ఫటికంలాగా మెరుస్తున్నది. అయితే అంబుజం కట్టుకొన్న చిన్నలంగా మాత్రం ఏవర్ణమో వూహించలేక పోయినాడు. దగ్గిరకు వచ్చి చూసినాడు. ఆగుడ్డలోనుంచే ఆదుర్వాసన అంతా అనుకొన్నాడు. "అంబూ అంబూ" అని లేపాడు. ఆమె కళ్లు నులుపుకొంటూ లేచింది. "ఏమిటి - అబ్బ నిద్ర వస్తూవుంది. చాలా బడలికగా వుంది" అంది. "సరేలే- నీవు పాపం-దిక్కుమాలినగుడ్డ విడిచేసి మరొకటికట్టుకో."

ఆమె నవ్వుతూ, "ఏమిటండీ మరీ ఆశ్చర్యం - వారం రోజులయినా కాలేదు అది కట్టుకొని" అంది.

"అయితే లోపల వేసుకొనేలంగా ఎన్నాళ్లకొకసారి మారుస్తావు?"

రోజుల కొకసారి ఎవరయినా మారుస్తారు. లోపల కట్టుకొనేది మారుస్తారా! అయినా యినాళ్లు మారుస్తానను కొన్నాను. వీగొడవలో మరిచి పోయినాను."

"సరే ముందు యింకొకటి కట్టుకో"

ఆమె వెంటనేలేచి వెళ్లి తెల్లగా వుతికిన మరొకటి కట్టుకొనివచ్చి పడుకొన్నది. కొంచెం సేపటికి మళ్లీ ఏదో వాసనవేయడం మొదలుపెట్టింది. ఆమెకు నిద్ర మత్తుగా వుంది. శాస్త్రికి అనుమానం ఎక్కువయింది. ఆమె ఒళ్లే వాసన వేస్తున్నదేమోనని తోచింది... తనముఖం ఆమె వక్షఃస్థలం మీదవుంచాడు. అతని అనుమానం నిజం అయింది. వెంటనే ఆమెను చేతితో తడుతూ "అంబూ నీవు ఎన్నాళ్లయింది నీళ్లుపోసుకొని" అన్నాడు.

"ఏమిటండీ మరీ ఆశ్చర్యం - రోజూ మూడుసార్లు ఒళ్లు కడుక్కొంటున్నాను."

"అంటే ఏమిటి - ఒంటినిండా నీళ్లు పోసుకొంటు న్నావా?"

"ప్రతిరోజూ కాకిలాగా నీళ్లలో మునగడం నా కల వాటు లేదు."

"అయితే ఏభాగం నీళ్లతో తడుపుతున్నావో కాస్త చెప్పుదూ?"

"ముఖమూ మోకాళ్లవరకూ కాళ్లూ మోచేతుల వరకూ చేతులూ రోజూ కడుగుకొంటూనే వున్నాను. పయిగా సబ్బుపెట్టి తోముకొంటున్నాను."

"అయితే దేహాన్ని అంతా తడపడం ఎన్నాళ్ల కొకసారి?"

"ప్రతి ఆదివారమూ యిదివరలో తప్పక పోతూవుండే దాన్ని - ఆరోగ్యం వుదయమే ఒంటినిండా నీళ్లుపోసుకొనే దాన్ని. కాస్త డబ్బున్నవాళ్లు అయితే ఆదివారం తలకు పోసుకొంటారు. రాత్రి విషయాలన్నీ పెట్టుకొని తెల్ల వార్లూ నిద్రపోనీయకుండా వున్నారు. పడుకొందురూ."

"సరేలే - కాని నీవు ప్రతిరోజూ స్నానం చేయ వలెను. కనీసం రెండుసార్లు అయినా చేయవలెను."

"బాగానే వున్నవి మీషరతులన్నీని! మాతాతా అమ్మమ్మ వుండకూడదు. నేను వుల్లిపాయలు ముట్టుకో

కూడదు - ప్రతిరోజూ లోపల వేసుకొనే బాడీ - అదీ మార్చవలెను. ఇక రెండుసార్లు రోజూ తలంటి పోసుకో వలెను. ఇంతేనా యింకా ఏమయినా షరతులున్నవా? అవికూడా ఒక్కసారే చెప్పివేస్తే తీరిపోతుంది."

"ముందు యీ చెప్పినవన్నీ చక్కబెడితే"

"ఇవన్నీ ముందుగా - నన్ను వివాహమాడకపూర్వమే పోనీ పెండ్లి చేసుకోడానికి పూర్వమే చెప్పివున్నట్లయితే ఎంత బాగుండి వుండేది"

"అయితే యివన్నీ ఆచరించ దలచుకో లేదన్న మాట."

"చాలు లెండి. యిక పడుకోండి"

"ఇవన్నీ ఆచారాలలో రేపటినుంచి పెట్టుకొనెదను"

"సరే తెల్లవారని తర్వాత చూసుకొందాం"

"అదంతా కాదు - నీవు ముందునాకు వాగ్దానం చేయవలెను"

"ముందు పడుకోండి"

"నీవు వాగ్దానం చేయకపోతే - తక్కిన విషయాలు తెల్లవారిన్నా ముందు ముసలివాళ్లను గోలి వేయాలి."

"అపరాత్రివేళ ఏమిటండి యీ బాధ?"

"అవును బాధే!"

"చాలా బాగావుంది. వాళ్ళు తెల్లవారేసరికి ఎక్కడికి పోతారు?"

"పోనీ వాళ్లను పొయ్యంత్రం లోపల పెయినా?"

"అవును, అదంతా తర్వాత చూసుకొందాం"

"నీవు వాగ్దానం చేస్తావా చేయవా"

"ఏమిటీ నిర్బంధం?"

ఇంతలో గాలికపటం ఆరిపోయింది. ఆమె మాట్లాడడం మానివేసింది.

ఏమేమో అన్నాడు శాస్త్రి. ఆమె పలుకలేదు.

తెల్లవారింది అతను కనుపించలేదు.

*　　　*　　　*

సంవత్సరము అయింది. అంబుజమ్మకు ఒకపిల్లవాడు పుట్టాడు. శాస్త్రి జాడ మాత్రం పాపం ఆమెకు తెలియు లేదు.





డా॥ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి

(బెజవాడ) వీరి పుస్తకములును, మందులును, ద్రవ్యమును దేశప్రసిద్ధములు. కావలసినవి పోస్టుద్వారా పంపబడును. కేట్లాగు ఉచితము.